**Andhra Jyothi**

# సివిల్స్‌కు గరిష్ఠ వయోపరిమితి తగ్గింపు!

- బస్వాన్ కమిటీ సిఫారసు
- మార్కుల వెయిటేజీ, మూల్యాంకనంపైనా సూచనలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: దేశవ్యాప్తంగా లక్షల మంది అభ్యర్థులు రాసే ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీసెస్ పరీక్షకు గరిష్ఠ వయోపరిమితిని తగ్గించనున్నారా? ఈ పరీక్ష విధివిధానాల (ప్యాటర్న్) మార్పులపై తన నివేదికలో బస్వాన్ కమిటీ ప్రధానంగా ఇదే సిఫారసు చేసినట్లు సమాచారం. ఈమేరకు బస్వాన్ కమిటీ గతనెల సీల్డ్ కవర్‌లో సమర్పించిన నివేదికను సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ మంత్రిత్వశాఖ (డీవోపీటీ)కు యూపీఎస్సీ పంపింది. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ తదితర అత్యున్నత సర్వీసులకు నిర్వహించే సివిల్స్ పరీక్ష ప్యాటర్న్‌లో మార్పులు చేర్పులపై హెచ్ఆర్డీ మాజీ కార్యదర్శి బీఎస్ బస్వాన్ అధ్యక్షతన గత ఏడాది ఆగస్టులో యూపీఎస్సీ కమిటీని నియమించింది. తాజా నోటిఫికేషన్ ప్రకారం సివిల్స్ పరీక్షకు 2016 ఆగస్టు 1 నాటికి 21 ఏళ్లు నిండిన, 32 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులు. ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిని పొడిగించారు. కాగా సివిల్స్ పరీక్షకు 32. ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిని తగ్గించాలని కమిటీ సిఫారసు చేసినట్లు తెలిసింది. పరీక్ష ప్రణాళిక, పేపర్ల సంఖ్య, పరీక్ష సమయం, మార్కుల వెయిటేజీ, మూల్యాంకనం తదితర అంశాలపైనా కీలక సూచనలు చేసినట్లు సమాచారం.